సాక్షి సిద్దిపేట
మంగళవారం ၊ 7 ၊ నవంబర్ ၊ 2023



క్షణాల్లో ఓటర్ ఐడీ కార్డు

ఇంటినుంచే ఓటరు ఐడీ కార్డును క్షణాల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

వివరాలు 10లో ▸



గీత దాటితే వేటే..

ప్రతి నియోజకవర్గంలో ఎన్నికల సంఘం నిఘా వ్యవస్థను కట్టుదిట్టం చేసింది.

వివరాలు 10లో ▸



క్రీడల్లో ప్రతిభ చాటాలి

క్రీడాకారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని ప్రతిభచాటాలని డీవైఎస్‌ఓ సూచించారు.

వివరాలు 11లో ▸

క్షణక్షణం.. నిరీక్షణం!

ఆ రెండు చోట్ల బీజేపీ అభ్యర్థులెవరో?

- ఇంకా ఖరారు చేయని అధిష్టానం
- సిద్దిపేట, హుస్నాబాద్ శ్రేణుల్లో ఉత్కంఠ
- ముంచుకొస్తున్న నామినేషన్ల స్వీకరణ గడువు
- ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్, కాంగ్రెస్



ఓ వైపు నామినేషన్ల స్వీకరణ గడువు ముంచుకొస్తున్నా రెండు చోట్ల బీజేపీ అభ్యర్థుల ప్రకటన వెలువడటంలేదు. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. మరో మూడు రోజుల్లో స్వీకరణ గడువు ముగియనుంది. మరోవైపు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ప్రచారంలో దూసుకెళ్తున్నారు. సిద్దిపేట, హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థులను ప్రకటించకపోవడంతో కార్యకర్తల్లో కలవరం నెలకొంది.

సాక్షి, సిద్దిపేట: బీజేపీ రెండు జాబితాలను అక్టోబర్ 22న, 27వ తేదీలలో ఆ పార్టీ కేంద్ర నాయకత్వం విడుదల చేసింది. అందులో దుబ్బాక అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్ రావు, గజ్వేల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జనగామ అభ్యర్థిగా దశమంతరెడ్డిలను ప్రకటించారు. సిద్దిపేట, హుస్నాబాద్ అభ్యర్థులను ప్రకటించలేదు. హుస్నాబాద్ నుంచి బరిలో దిగేందుకు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, సురేందర్ రెడ్డిలతో పాటు ఇటీవల పార్టీలో చేరిన సామాజిక సేవకురాలు కర్ణ కంటి మంజుల సైతం టికెట్‌ను ఆశిస్తున్నారు. బండి సంజయ్ అనుచరుడిగా శ్రీరాంచక్రవర్తి, ఈటల రాజేందర్ అనుచరుడిగా సురేందర్ రెడ్డిలు కొనసాగుతున్నారు. ఈ ఇద్దరు నేతలు ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో టికెట్ కోసం పైరవీలు చేస్తున్నారు. సిద్దిపేట టికెట్ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి ఆశిస్తున్నారు. కొన్నేళ్లుగా పార్టీలో ఉంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనకే అవకాశం ఇవ్వాలని కేంద్ర నాయకత్వంను కోరుతున్నారు. సిద్దిపేట నుంచి బరిలో దింపేందుకు సరియైన అభ్యర్థి కోసం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. బీజేపీ బరిలో ఉంటుందా.. జనసేనకు అవకాశం కల్పిస్తారా? అన్నది జిల్లా వ్యాప్తంగా చర్చసాగుతోంది. మంగళవారం గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల నామినేసన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరుకానున్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ముందంజ

అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు అన్ని నియోజకవర్గాలలో ప్రధాన పార్టీలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల నుంచి పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. అందరి కంటే ముందుగా ఆగస్టు 21న బీఆర్‌ఎస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. బీఆర్‌ఎస్ ప్రచారంలో దూసుకెళ్తోంది. అక్టోబర్ 15న హుస్నాబాద్, 17న సిద్దిపేటలలో ప్రజా ఆశీర్వాద సభలలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. అక్టోబర్ 15న, 27వ తేదీలలో రెండు జాబితాల్లో కాంగ్రెస్ అభ్యర్థును ప్రకటించింది. బీజేపీ ఇప్పటి వరకు మూడు నియోజకవర్గాలకు అభ్యర్థులను మాత్రమే ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సైతం ప్రచారం ముమ్మరం చేస్తున్నారు.

నిరుద్యోగులను విస్మరించిన కేసీఆర్

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి



మాట్లాడుతున్న కసిరెడ్డి మణికంఠరెడ్డి

హుస్నాబాద్: రాష్ట్రంలో తొమ్మిదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి, నిరుద్యోగ యువతను విస్మరించిందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్‌ఎస్ పార్టీని, కేసీఆర్‌ను ఓడించాలన్నారు. నియోజకవర్గంలో ఓట్ల కోసం వచ్చే బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రశ్నించాలన్నారు. యువత త్యాగాలతో ఏర్పడిన ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం అరాచక పాలనను కొనసాగిస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కేజీ టూ పీజీ ఉచిత విద్య అమలు కాలేదన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ ప్రభుత్వ విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్లక్ష్యం చేసి ప్రైవేట్ యూనివర్సిటీలకు అనుమతులు ఇచ్చారన్నారు. లక్ష ఉద్యోగాల హామీ గాలికొదిలేసి, ప్రశ్నపత్రాల లీకేజీలతో నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమయ్యారని మణికంఠ రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి జనార్దన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మచ్చ రమేష్, నాయకులు సమ్మయ్య, తిరుపతి, వినయ్ వర్ధన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు



నీలం మధు
పటాన్‌చెరు



సురేష్ షెట్కార్
నారాయణఖేడ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: పటాన్‌చెరు, నారాయణఖేడ్ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థిత్వాలపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. పటాన్‌చెరు టికెట్‌ను ఇటీవల ఆ పార్టీలో చేరిన నీలం మధు ముదిరాజ్‌కే ఖరారు చేస్తూ కాంగ్రెస్ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. అలాగే నారాయణఖేడ్ అభ్యర్థిత్వాన్ని మాజీఎంపీ సురేష్‌షెట్కార్‌కు ఖరారు చేసింది.

అభ్యర్థి కాదు.. పార్టీ ముఖ్యం

- అభ్యర్థి విజయానికి అందరూ కృషి చేయాలి
- సిద్దిపేట అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జి రాజేశ్ పిళ్లై



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్ పిళ్లై

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట బీజేపీ అభ్యర్థిగా పార్టీ ఎవరి పేరు ఖరారు చేసినా గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మహారాష్ట్ర పార్టీ సీనియర్ నాయకుడు, సిద్దిపేట అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేశ్‌పిళ్లై పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేశ్‌పిళ్లై మాట్లాడారు. ఎన్నికలకు ఎక్కువ సమయం లేకపోవడంతో పార్టీ శ్రేణులు 24 గంటలు కష్టపడాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని రెండు పార్టీలు కలిసి బీజేపీని అధికారంలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కుట్రలు ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల సర్వేలు పట్టించుకోవద్దని, ఈసారి తెలంగాణలో ప్రజలు బీజేపీని గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. బూత్ కమిటీలు కీలకంగా పనిచేయాలన్నారు. గ్రామ గ్రామాన పార్టీని బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావు, మల్లేశం, కోడూరి నరేష్, శ్రీనివాస్ రెడ్డి, నరసింహారెడ్డి, కుమారస్వామి, పరశురాములు, గోనె మార్కండేయులు, ముచ్చర్ల నాగరాజు, తొడుపునూరి వెంకటేశం పాల్గొన్నారు.

500 నామినేషన్లు వేస్తాం

లక్డారం గ్రామస్తుల స్పష్టీకరణ

పటాన్‌చెరు టౌన్: గ్రామంలో క్రషర్లు ఎత్తివేయాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని లక్డారం గ్రామస్తులు భిక్షాటన చేశారు. క్రషర్ మిషన్లు ఎత్తివేయనట్లయితే 500 నామినేషన్లు వేస్తామని స్పష్టం చేశారు. క్రష్షర్లు ఎత్తివేయాలని 258 రోజులుగా దీక్ష చేపట్టినా ఎవరు స్పందించడం లేదన్నారు.

స్వర్ణప్రాశనతో పెరగనున్న రోగనిరోధకశక్తి

వైష్ణవ ఠాకూర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గుమ్మడిదల శ్రీనివాస్



విద్యార్థులకు స్వర్ణ ప్రాశన చుక్కలను వేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్వర్ణప్రాశనతో విద్యార్థులకు రోగనిరోధకశక్తితో పాటు గ్రహణశక్తి పెరుగుతుందని ఓహెచ్ వైష్ణవ ఠాకూర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ గుమ్మడిదల శ్రీనివాస్ అన్నారు. జాతీయ ఆయుర్వేద వైద్య దినోత్సవం పురస్కరించుకుని ఓహెచ్ వైష్ణవ ఠాకూర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరా నగర్, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత స్వర్ణ ప్రాశన ఆయుర్వేద వైద్య శిబిరం, ఆయుర్వేద వైద్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరం లో డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మా సంస్థ నుంచి లక్ష మంది విద్యార్థులకు ఉచితంగా స్వర్ణప్రాశన వేయడానికి సంకల్పించామన్నారు. 2000 మంది విద్యార్థులకు పైగా స్వర్ణ ప్రాశన చుక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ హోమియోపతి వైద్యులు డాక్టర్ దేవేందర్, రాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు 9 నామినేషన్లు



సిద్దిపేటలో నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీనివాస్

సిద్దిపేటజోన్: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌లో భాగంగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం మూడో రోజు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన ఎక్కలదేవి లింగం, మిట్టపల్లికి చెందిన వర్కోలు శ్రీనివాస్‌లు స్వతంత్ర అభ్యర్థులుగా రిటర్నింగ్ అధికారి రమేశ్‌బాబుకు నామినేషన్లు అందచేశారు. దీంతో ఇప్పటివరకు సిద్దిపేటలో నామినేషన్ల సంఖ్య నాలుగుకు చేరింది.

గజ్వేల్‌లో ఒకటి..

గజ్వేల్: ఒకే ఒక నామినేషన్ దాఖలైంది. మనోహరాబాద్ మండలం చెట్ల గౌరారం గ్రామానికి చెందిన బక్క సదేశ్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ విషయాన్ని స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి బన్సీలాల్ తెలిపారు.

హుస్నాబాద్‌లో మూడు..

హుస్నాబాద్: ఆర్‌ఓ కార్యాలయంలో ముగ్గురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పచ్చిమట్ల రవీందర్ గౌడ్, కాశవేని సమ్మయ్య, ధర్మ సమాజ్ పార్టీ నుంచి బోయిని సదన్ మహరాజ్‌ల నామినేషన్ల పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ బెన్ షాలోమ్‌కు అందజేశారు.

దుబ్బాకలో మూడు..

దుబ్బాకటౌన్: సోమవారం మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరీమ అగ్రవాల్ తెలిపారు. గౌట మల్లేష్ (రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ), పెద్దలింగన్నగారి ప్రసాద్ (స్వతంత్ర అభ్యర్థి), వేముల వెంకటప్రసన్న(ధర్మ సమాజ్ పార్టీ) నామినేషన్లు సమర్పించారన్నారు.

క్షుణ్ణంగా వాహనాల తనిఖీ

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు వెంకదేష్‌బాబు, కలెక్టర్ ప్రశాంత్ పాటిల్
- పొన్నాల వద్ద ఎస్‌ఎస్‌టీ చెక్‌పోస్టు పరిశీలన



ఎస్‌ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

సిద్దిపేటఅర్బన్: ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి డబ్బు, మద్యం అక్రమ రవాణా కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు వెంకటేష్‌బాబు (ఐఆర్‌ఎస్) చెక్‌పోస్టు అధికారులకు సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల రాజీవ్ రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్‌ఎస్‌టీ చెక్ పోస్టును సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల తనిఖీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. స్పెషల్ ఆఫీసర్ సీతారామరాజు, త్రీటౌన్ సీఐ భానుప్రకాష్‌తో మాట్లాడారు. అధికారులు షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తూ అప్రమత్తంగా ఉండి అన్ని రకాల వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సీసీ కెమెరాల ద్వారా కలెక్టరేట్ నుండి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. సోమవారం సాయంత్రం పొన్నాల ఎస్‌ఎస్‌టీ చెక్‌పోస్టును అడిషనల్ డీసీపీ (లాఅండ్ ఆర్డర్) మల్లారెడ్డి పరిశీలించారు.

స్ట్రాంగ్‌రూం వద్ద పటిష్ట బందోబస్తు

సిద్దిపేటఅర్బన్: సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గా స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట బందోబస్తు నిర్వహించాలని బీఎస్‌ఎఫ్ అధికారులకు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ సూచించారు. సోమవారం పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూం గదిని, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. 24 గంటలు బందోబస్తు నిర్వహించాలని గార్డ్స్‌కు సూచించారు. కలెక్టర్ వెంట సిద్దిపేట ఏసీపీ సురేందర్‌రెడ్డి, ఏఆర్వో దిలీప్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్ ఉన్నారు.

ఎన్నికల సామగ్రి భద్రపరిచే గదుల పరిశీలన

కొండపాక(గజ్వేల్): దుద్దెడ గ్రామ శివారులోని సమీకృత కార్యాలయ భవన సముదాయంలో ఎన్నికల సామగ్రి భద్రపరిచే గదులను కలెక్టర్ పరిశీలించారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్‌లను భద్రపర్చడం కోసం అన్ని రకాల వసతులు, సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్స్ సూపరింటెండెంట్ రామేశ్వర్, డీటీ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్, ఆర్‌అండ్‌బీ ఈఈ రాములు, డీఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



తాడూరులో విద్యార్థుల నోట్ బుక్స్ పరిశీలిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పలుపాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని అర్జునపట్ల, కమలాయపల్లి, దానంపల్లి, చిట్యాల, తాడూరు గ్రామాల ప్రభుత్వ పాఠశాలలను ఇన్‌చార్జి ఎంఈఓ నర్సింహారెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో టెన్త్ ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఆరాతీశారు. ప్రతి రోజు ఉదయం 8:30 నుంచి 9:30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఈ విద్యాసంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 100శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం కావాలన్నారు. జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. అలాగే ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా సిద్ధం చేయాలన్నారు. సీఎం అల్పాహార కార్యక్రమం వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీ కనకరాజు ఉన్నారు.

అండగా ఉంటాం

- మంత్రి హరీశ్‌రావుకు సంపూర్ణ మద్దతు
- ఏకగ్రీవంగా దివ్యాంగుల తీర్మానం
- ప్రచారకర్తలు కండి: కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవారెడ్డి





మాట్లాడుతున్న వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవా రెడ్డి, హాజరైన దివ్యాంగులు

సిద్దిపేటజోన్: 'గత ప్రభుత్వాలు మమ్మల్ని పట్టించుకోలేదు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక మా జీవితంలో వెలుగులు వచ్చాయి. ఆసరా పింఛన్ ద్వారా ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని పెంచిన బీఆర్‌ఎస్‌కు కుటుంబసమేతంగా సంపూర్ణ మద్దతు ఇస్తా'మని నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాలకు చెందిన దివ్యాంగులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సోమవారం స్థానిక కొండభూదేవి-మల్లయ్య గార్డెన్‌లో దివ్యాంగుల ఆత్మీయసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలువురు దివ్యాంగులు మాట్లాడారు. దివ్యాంగులంతా ఏకమై బీఆర్‌ఎస్‌కు, మంత్రి హరీశ్‌రావుకు అండగా ఉండాలని, భారీ మెజారిటీతో గెలిపించడంలో భాగస్వామ్యం అవుదామన్నారు. సీఎం కేసీఆర్ దివ్యాంగులకు రూ.4,016 పింఛన్ ఇచ్చి అండగా ఉన్నారన్నారు. అనంతరం ఏకగ్రీవ తీర్మానం పత్రాలను రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ మాట్లాడుతూ హరీశ్‌రావు అధిక మెజార్టీ కోసం మనమంతా ప్రచార కర్తలుగా కావాలని పిలుపునిచ్చారు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో దివ్యాంగుల పింఛన్లు నామ మాత్రంగా ఉన్నాయని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వరాష్ట్రంలోనూ దివ్యాంగులకు రూ.వెయ్యి లోపు ఉందని, మన రాష్ట్రంలో ఐదు లక్షల మంది దివ్యాంగులకు రూ.4,016 చొప్పున రూ.2 వేల కోట్లు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. అంతకుముందు జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ.. మంత్రి హరీశ్ రావుకు మద్దతుగా స్వచ్ఛందంగా పెద్ద మనసుతో వచ్చిన దివ్యాంగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు శంకర్, మున్నాతో పాటు వందలాది దివ్యాంగులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కే మద్దతంటూ ఒక్కటైన ఊరు



బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్న శేఖర్‌రావుపేట గ్రామస్తులు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలం శేఖర్‌రావుపేట గ్రామ ప్రజలు మూకుమ్మడిగా బీఆర్‌ఎస్‌కే మద్దతు అంటూ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలోని కుల సంఘాలు ఏక తాటిపైకి వచ్చి మద్దతు పలుకుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ మా గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మంత్రి హరీశ్ రావుతోనే సాధ్యమైందన్నారు. తమ గ్రామాన్ని నూతనంగా గ్రామ పంచాయతీ ఏర్పాటు చేశారని అన్నారు. ఊరంతా ఏకమై హరీశ్‌కు మద్దతు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలకృష్ణ, మాటిండ్ల సర్పంచ్ నారాయణ, మండలస్థాయి నాయకులు ఎల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరెడ్డి



చిన్నకోడూరులో సభ్యత్వ నమోదు చేపడుతున్న తిరుపతిరెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, డీఏలను వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పెద్దకోడూరు, చిన్నకోడూరు, రామంచ తదితర పాఠశాలల్లో టీపీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ అర్థంతరంగా నిలిపివేయడం దురదృష్టకరమన్నారు. బదిలీ ఉత్తర్వులు అందుకుని రిలీవ్ కానీ టీచర్లను విడుదల చేయాలన్నారు. సమావేశంలో సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాజు, జిల్లా సభ్యులు పరమేశ్వర్‌రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టును పరిశీలించిన జనగామ కలెక్టర్



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జనగామ కలెక్టర్

కొమురవెల్లి(సిద్దిపేట): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అయినాపూర్‌లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జనగామ కలెక్టర్ శివలింగయ్య సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి తగు సూచనలు చేశారు. అంతకు ముందు కొమురవెల్లి మల్లికార్జున స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

వర్గల్(గజ్వేల్): వర్గల్ నవోదయలోని 9వ, 11వ తరగతులలో ఖాళీ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువు ఈ నెల 15 వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. విద్యార్థుల ప్రయోజనం కోసం గడువు పెంపు నిర్ణయం తీసున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 10న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ బీఫామ్ అందజేత



బీఫామ్‌ను అందుకుంటున్న పొన్నం సోదరుడు రవిచంద్ర

హుస్నాబాద్: పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ బీఫామ్‌ను గాంధీభవన్‌లో సోమవారం ఆయన సోదరుడు పొన్నం రవిచంద్ర, చందర్, అశోక్‌వ్యాస్‌లకు అందజేశారు. ఏఐసీసీ కార్యదర్శులు విష్ణునాథన్, రోహిత్ చౌదరిలు బీఫామ్ అందజేసి పొన్నం ప్రభాకర్ అఖండ విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

జగదేవ్‌పూర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. జగదేవ్‌పూర్ మండలం కొత్తపేట, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లిలో నెలకొన్న భూసమస్యకు సీఎం కేసీఆర్ చొరవతో పరిష్కారం లభించిందని అన్నారు. మండల పరిధిలోని కొత్తపేటలో సీఎం కేసీఆర్‌కే తమ మద్దతు అంటూ గ్రామస్తులు సోమవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మండల ఎన్నికల ఇన్‌చార్జి రాధాకృష్ణశర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ బాలేశంగౌడ్, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్షణాల్లో.. ఓటరు ఐడీ కార్డ్

చిన్నకోడూరు(సిద్దిపేట): కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఓటరు ఐడీ కార్డు రావడం ఆలస్యం అవుతుంది. కేంద్ర ఎన్నికల సంఘం తాజాగా కల్పించిన వెసులు బాటుతో ఇంట్లో నుంచే ఓటరు ఐడీ కార్డును క్షణాల్లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అదేలాగో ఇప్పుడు చూద్దాం..

ఆన్‌లైన్‌లో పొందండిలా..

ముందుగా ఎన్‌వీఎస్‌పీ పోర్టల్‌లో voterrecgov.in లో లాగిన్ అవ్వాలి. తర్వాత హోమ్‌పేజ్‌లో ఉన్న ఈ–ఎపిక్ డౌన్‌లోడ్ ఆప్షన్ ఎంచుకోవాలి. అనంతరం స్క్రీన్‌పై అడిగిన విధంగా మీ మొబైల్ నంబర్ లేదా ఈ మెయిల్ ఐడీ లేదా ఎపిక్ నంబర్‌ను ఎంటర్‌చేసి సబ్‌మిట్ బటన్ నొక్కాలి. తరువాత రిక్వెస్టు ఓటీపీపై క్లిక్‌చేస్తే మీ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దానిని నిర్దేశించిన బాక్స్‌లో నమోదు చేయాలి. చివరగా డిజిటల్ ఓటర్ ఐడీ కార్డును డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఈ–ఎపిక్ అనే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఓటరు ఐడీ పీడీఎఫ్ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్ అవుతుంది. ఫిజికల్ కార్డు కావాలనుకునే వారు దగ్గర్లోని మీ సేవా లేదా ఇంటర్‌నెట్‌కు వెళ్లి ఓటర్ ఐడీ కార్డును ప్రింట్ తీసుకోవచ్చు.



తప్పిన తిప్పలు

ఈ ప్రక్రియతో ఎన్నికల సంఘం పంపే ఓటరు గుర్తింపు కార్డు కోసం రోజుల తరబడి ఎదురు చూడాల్సిన అవసరం ఉండదు. ఈ సౌలభ్యం గతంలోనూ ఉన్నప్పటికీ అది ఆమోదం పొందేందుకు చాలా సమయం పట్టేది. నమోదిత వివరాలు సంబంధిత అసెంబ్లీ ఎన్నికల అధికారి ఆమోదించిన తరువాతే ఆ ప్రక్రియ పూర్తయ్యేది.

నచ్చలేదా.. నోటా నొక్కేస్తున్నారు

- మెదక్ జిల్లాలో అభ్యర్థులపై పెరుగుతున్న వ్యతిరేకత
- గత ఎన్నికల్లో 2263 ఓట్లు పోల్

మెదక్ కలెక్టరేట్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నచ్చకపోయినా గతంలో ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేసేవారు. కొంత కాలంగా అభ్యర్థులపై తమ అయిష్టతను తెలియజేసేందుకు ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌లో ''నోటా'' ఆప్షన్‌ను జత చేసింది. దీంతో ఓటర్లు నోటా ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 12 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. బీఆర్‌ఎస్ నుంచి పద్మాదేవేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఉపేందర్‌రెడ్డి, బీజేపీ నుంచి ఆకుల రాజయ్య, బీఎస్పీ నుంచి దూడ యాదేశ్వర్, జనతా పార్టీ నుంచి మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, ఇతర పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచారు. వారిలో పద్మాదేవేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందగా, ఉపేందర్‌రెడ్డి రెండో స్థానంలో నిలిచారు. కాగా బీజేపీ అభ్యర్థి ఆకుల రాజయ్య డిపాజిట్ కోల్పోయారు. ఇక మిగతా వారి సంగతి అంతంత మాత్రమే. ఈ ఎన్నికల్లో 899 పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి మొత్తం 1,68,911 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అందులో 2263 మంది నోటాకు ఓటేసి అభ్యర్థులపై తమ నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో వివిధ శాఖల ద్వారా అత్యవసర సేవలు అందించే అధికారులకు కేటాయించే 899 పోస్టల్ బ్యాలెట్‌లలో 49 ఓట్లు చెల్లకుండా పోగా, 3 ఓట్లు నోటాకు పడడం గమనార్హం. ఇప్పటికీ ''నోటా'' అనే మీట ఉందనే విషయం చాలా మంది ఓటర్లకు తెలియదు. అందువల్లే నోటాకు ఓట్లు తక్కువగా పడుతున్నాయని విద్యావంతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును నోటాకు కాకుండా సరైన నాయకుడికి వేసి అభివృద్ధికి దోహద పడాలని మేధావులు సూచిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో నోటాను మీటే ఓట్లు ఎన్నో తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



జంగ్ తెలంగాణ

క్లుప్తంగా

కాంగ్రెసోళ్లను నమ్మి మోసపోవద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): కాంగ్రెస్ నాయకులకు ఒక్కసారి కాదు.. 11సార్లు 55 ఏళ్ల చాన్స్ ఇచ్చినా ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయారని ఎంపీపీ మాలోతు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ అన్నారు. సోమవారం మండలంలోని మల్లంపల్లి, పెద్ద తండా, జనగామ, అంతక్కపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడారు.. కాంగ్రెస్ హయాంలో తండాల్లో గుక్కెడు తాగునీళ్లు కూడా దొరకలేదని, బిందెలు పట్టుకొని పొలాలకు పరుగులు పెట్టారని గుర్తు చేశారు. గిరిజనులంతా బీఆర్‌ఎస్ అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్‌కు ఓటేసి గెలిపించాలని అన్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో తిరుపతినాయక్, రాంచందర్‌నాయక్, రాజునాయక్, సత్యంనాయక్, వీరన్ననాయక్, శ్రీనివాస్‌నాయక్, మోహన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రసమయి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో సోమవారం రాత్రి బీఆర్‌ఎస్ నిర్వహించిన ప్రచార సభలో స్థానిక ఎంపీటీసీ భర్త మధుసూదన్‌రెడ్డిపై ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. మధుసూదన్‌రెడ్డి ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అతను పార్టీ మారి ఓట్లు ఎలా అడుగుతాడని మాట్లాడటంతో గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్‌ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు ఖర్చులు. 9990752820. [T-203]

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 8099161810. [H-193272]

WANTED

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-601043]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073 [H-189348]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు MF వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036 [B-1206468]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

-నారాయణఖేడ్

గీత దాటితే.. వేటే!

ఎన్నికల ప్రవర్తనా నియమావళి కచ్చితంగా అమలయ్యేలా ఎన్నికల సంఘం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. నాయకులు ఓటర్లను ప్రభావితం చేయాలని చూస్తే కఠినంగా వ్యవహరించనుంది. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం ప్రచారాలకు దూరంగా ఉండాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొనడం నియమావళి ఉల్లంఘన కిందికి వస్తుంది. జిల్లాలో ఉద్యోగుల ప్రవర్తన తీరు గురించి అక్కడక్కడ వస్తున్న ఫిర్యాదులపై ఎన్నికల అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు.

- ప్రభుత్వ ఉద్యోగులూ తస్మాత్ జాగ్రత్త
- చాటుమాటు ప్రచారం చేసినా వేటు తప్పదు
- ప్రత్యేక నిఘా పెట్టిన ఎన్నికల సంఘం



గత అనుభవాల దృష్ట్యా..

గతంలో జరిగిన ఎన్నికల్లో కొందరు ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిబంధనల ఉల్లంఘనకు పాల్పడడం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, సాటి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్లు ఒక పార్టీకి వేసేలా ఒత్తిడి తెచ్చిన ఘటనలు జరిగాయి. కాగా ఈ సారి కోడ్ ఉల్లంఘనపై సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఎన్నికల సంఘం సిద్ధం చేసింది. గతంలో రాజకీయ పార్టీల కార్యాలయాల వద్ద ఉద్యోగులు తిరగాడడం, కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా ఈ మారు అలా జరగకుండా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

పటిష్ట నిఘా..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేయడంలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసింది. రాజకీయ పార్టీల ప్రచార సమయంలో వీడియో రికార్డింగ్ పకడ్బందీగా చేయిస్తోంది. ఇలా చేసిన రికార్డింగ్‌ను పరిశీలన బృందం అధికారులు ఎప్పటికప్పుడు వీక్షిస్తుంటారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నట్లు గమనిస్తే ఎన్నికల సంఘానికి నివేదిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులపై వేటు వేయడం లేదా శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటారు. అదే విధంగా సోషల్ మీడియాను సైతం మీడియా మానిటరింగ్ బృందం అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. పార్టీలకు అనుకూలంగా, ప్రతికూలంగా పోస్టులు పెట్టినా ఎన్నికల సంఘం చర్యలకు బాధ్యులు కావాల్సి ఉంటుంది.

ఇవీ నిబంధనలు..

ఉద్యోగులు ఏ రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనకూడదు. తన కిందిస్థాయి ఉద్యోగులను, ఇతరులను ఫలానా పార్టీకి ఓటు వేయాలని ఒత్తిడి చేయకూడదు. ఓటర్లు ప్రలోభాలకు గురయ్యేలా ప్రకటనలు ఇవ్వకూడదు. రాజకీయ పార్టీల కండువాలు వేసుకుని ప్రచారం నిర్వహించకూడదు. సోషల్‌మీడియాల్లో రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టకూడదు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వివిధ కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఎన్నికల కోడ్ పరిధిలోకి వస్తారు.

ఓ అధికారిపై చర్య

ఇటీవల జిల్లాలోని ఓ మండల స్థాయి అధికారి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించాడన్న ఫిర్యాదుపై జిల్లా ఎన్నికల అధికారి తక్షణం స్పందించి విచారణ చేశారు. సదరు అధికారి సంజాయిషీ తీసుకున్నారు. దానికి సంతృప్తి చెందని అధికారులు అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

మీకు ఈ సంగతి తెలుసా?



పాపన్నపేట(మెదక్): పోలింగ్ బూత్‌లో టెండర్ ఓటు, చాలెంజ్ ఓట్ల గురించి మాట్లాడుకుంటుంటే వింటుంటాం. అసలు వీటి గురించి చాలామందికి తెలియదు. ఇప్పుడు వాటి వివరాలు తెలుసుకుందాం. తమ ఓటు గల్లంతయ్యిందని ఫిర్యాదు చేసే వ్యక్తుల కోసం ఎన్నికల సంఘం 'టెండర్ ఓటు' ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఓటరు ఓటు వేయవచ్చు. ఎన్నికల సంఘం నిబంధనలలోని సెక్షన్ 42 ప్రకారం 'టెండర్ ఓటు' ఏర్పాటు చేశారు. మీరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లినప్పుడు.. అప్పటికే మీ ఓటు ఎవరైనా వేస్తే ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. అధికారి పరిశీలించి మీ గుర్తింపును ధ్రువీకరిస్తారు. దీని తర్వాత మీరు టెండర్ ఓటును డిమాండ్ చేయవచ్చు. ఇటువంటి పరిస్థితిలో ఈవీఎం ద్వారా ఓటు వేయలేరు. బ్యాలెట్ సాయంతోనే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుంది.

చాలెంజ్ ఓటు..

ఓటింగ్ జరుగుతున్నప్పుడు పోలింగ్ స్టేషన్‌లో చాలెంజ్ ఓటుకు అవకాశం ఉంటుంది. దీని ద్వారా అక్రమ ఓటర్లను అడ్డుకోవచ్చు. ఎన్నికల ఏజెంట్లు ఈ చాలెంజ్ ఓటును ఉపయోగించుకుంటారు. దీని కోసం రూ.2 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఎవరైనా ఓటరు ఓటు వేయడానికి పోలింగ్ స్టేషన్‌కు వచ్చినప్పుడు, అతను నకిలీ ఓటర్ అని ఏజెంట్ అనుమానించినప్పుడు చాలెంజ్ ఓటు ఉపయోగపడుతుంది. పోలింగ్ ఏజెంట్ ప్రిసైడింగ్ అధికారి ఎదుట చాలెంజ్ ఓటు వేస్తాడు. రూ.2 రుసుం కూడా చెల్లిస్తాడు. అప్పుడు ఎలక్టోరల్ ఆఫీసర్ ప్రిసైడింగ్ అధికారికి అతను సరైన ఓటరు కాదని తెలియజేస్తాడు. దీంతో ప్రిసైడింగ్ అధికారి ఓటరు దగ్గరున్న పత్రాలను తనిఖీ చేసి, అవి సరిగా ఉంటే ఓటరుకు ఓటు హక్కు కల్పిస్తారు. ఎన్నికల ఏజెంట్ చెప్పినది నిజమని స్పష్టమైతే ఓటరును ఓటు వేయకుండా అడ్డుకుంటారు.



దొరల రాజ్యాన్ని తరిమికొడదాం

దుబ్బాక: దొరల, రెడ్డిల పాలనతో దుబ్బాక అభివృద్ధికి నోచుకోలేదని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థి వెంకట ప్రసన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ కోరారు. సోమవారం ఆయన పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రాష్ట్రంలో అణగారిన కులాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా తమ పార్టీ ఎన్నికల్లో ముందుకు సాగుతుందన్నారు. అవినీతి ప్రభుత్వాలకు చరమగీతం పాడాలన్నారు.

తల్లి మందలించిందని.. ఇంట్లో నుంచి వెళ్లి..

కాలువలో శవమై తేలిన బాలుడు

గజ్వేల్‌రూరల్: తల్లి మందలించిందని ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఓ బాలుడు మరునాడు కాలువలో శవమై తేలిన ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నాయిని యాదగిరి–వాణి దంపతులకు ఓ కొడుకు, కూతురు ఉన్నారు. వీరి పెద్దకొడుకు చరణ్(11) రిమ్మనగూడలోని పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం తల్లిని డబ్బులు అడగడంతో చరణ్‌ను మందలించింది. దీంతో అతను ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. మరుసటి రోజు గ్రామ సమీపంలోని కాళేశ్వరం ప్రాజెక్టు కాలువలో చరణ్ మృతదేహం గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కాలువ వద్దకు వెళ్లిన పిల్లవాడు ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెంది ఉండవచ్చని పోలీసులు భావించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫ్రాడ్ కేసులో జరిమానా

జిన్నారం(పటాన్‌చెరు): ఉద్యోగుల పీఎఫ్ డబ్బును సొంత అవసరాలకు ఉపయోగించుకున్న కేసులో ఒకరికి సోమవారం కోర్టు జరిమానా విధించింది. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాలు. బొల్లారంలోని టర్బో మిషనరీ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ పరిశ్రమలో తోట సుబ్బారాయుడు డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. 2014లో ఉద్యోగుల పీఎఫ్ నగదు రూ.2,10,722 ను ఆయన వాడుకున్నాడు. అప్పటి ఎస్‌ఐ ప్రశాంత్‌కు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. దీనిపై సంగారెడ్డి ప్రథమ శ్రేణి, ప్రత్యేక మొబైల్ కోర్టు జడ్జి అనిత సుబ్బరాయుడికి రూ.3వేల జరిమానా విధించారు.

ఉద్యమంలో పోరాడిన చరిత్రే.. నా ఆస్తి

కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ సోమవారం నియోజకవర్గంలోని ఎల్కతుర్తి మండలంలో ఎన్నికల ప్రచారం ముగించుకొని సైదాపూర్ మండలానికి వెళ్తున్న క్రమంలో హుజూరాబాద్ శివారులో ఆయన వాహనాన్ని ఎన్నికల కోడ్ అధికారులు తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న సూట్ కేసును చూసిన పోలీస్‌లు అందులో ఏమి ఉన్నాయని ప్రశ్నించగా, ఇది నా ఆస్తి.. చూపించమంటారా అని పొన్నం దానిని తెరిచి చూపించారు. అందులో ఆయనకు సంబంధించిన తెలంగాణ చరిత్ర, పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రే దాడికి గురైనప్పటి దృశ్యాలు, ప్రధాని మన్మోహన్ సింగ్, పలువురి ఎంపీలు, సోనియాగాంధీతో సమావేశమైన చిత్రాలు కనిపించాయి.

బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరిచిన నాయకులు ఓట్ల కోసం గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మల్లుపల్లి, లింగుపల్లి, అల్వాలలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గ ప్రజల ఆత్మ గౌరవాన్ని సిద్దిపేట నాయకులకు తాకట్టు పెట్టేవారు కావాలా.. అభివృద్ధి చేసేవారు కావాలో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో దుబ్బాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఎంపీపై జరిగిన కత్తి దాడితో కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేకున్నప్పటికీ బురద జల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజల్లో మంచి స్పందన లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దెల రాజేష్, రత్నారెడ్డి, మహేష్, జహంగీర్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుందాం

ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిని మండలంగా మార్చిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకునే సమయం వచ్చిందని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కుకునూరుపల్లి మండలం రాంచంద్రాపూర్, తిప్పారం, కుకునూరుపల్లి, మాత్‌పల్లి, కోనాయిపల్లి, మేదినీపూర్ విశ్వనాతపల్లి, రవీంద్రనగర్, వెలికట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్ షో, బైక్ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికార దాహం కోసం కాంగ్రెస్, బీజేపీలు గ్రామాల్లో కొత్త బిచ్చగాళ్ల మాదిరిగా తిరుగుతున్నారన్నారు. మండలం మరింత అభివృద్ధి చెందాలంటే కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో దేవి రవీందర్, కోల సద్గుణ, పిస్క అమరేందర్, మడుపు భూంరెడ్డి, కాచం నవీన్ కుమార్, పాల్కంపల్లి నరేందర్, మల్లం ఐలయ్య, శ్రీనివాస్, కిరణ్‌కుమార్‌చారి, మహిపాల్, రుషీ, కనకయ్య, సంపత్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి పెరిగిన ఆదరణ

హత్నూర(సంగారెడ్డి): గ్రామాల్లో కాంగ్రెస్‌కు ప్రజాదరణ పెరిగిందని ఆ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రొయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో హస్తం పార్టీ విజయం ఖాయమన్నారు. నీరుడి పోచయ్య, జిల్లా వెంకటేష్, నీరుడి సత్యనారాయణ, పటేల్ దాసు, వీరేశం, రాములు, సామయ్య, సాయిలు, అంతరం భిక్షపతి, భిక్షపతి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంఏ. హకీమ్, కొన్యాల వెంకటేశం, రియాజ్ అలీ, మన్నే నర్సింలు, ప్రశాంత్ గౌడ్, కత్తుల సత్యనారాయణ, ఈసు బాబా, హరి శంకర్ గౌడ్, గౌడి శ్రీనివాస్, అరవింద్, ప్రసాద్ యాదవ్, భాను, అజయ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే.. దుబ్బాక సమస్యలన్నీ పరిష్కరిస్తా

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): గెలిచిన రెండేళ్లుగా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి, పోతాన్‌పల్లి, పోతాన్‌శెట్టిపల్లి, నడిమి తండాలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో ఉండే నాయకుడికే సమస్యల గురించి తెలుస్తుందని చెప్పారు. అందరి సమస్యలు తెలిసిన తనను గెలిపిస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. అనంతరం చందాయిపేట దుర్గమ్మ ఉత్సవాల్లో ఎమ్మెల్యేను తులాభారం వేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, భూపాల్, నాగేందర్‌రెడ్డి, హరిప్రసాద్, అంజాగౌడ్, జగన్‌గౌడ్, నాగభూషణం, గణేష్, రఘువీర్, కర్నపాండు, జ్యోతి,లావణ్య, రమ్య పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని మాధవనేని రఘునందన్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని కొండాపూర్, అందె గ్రామాల్లో ఆయన ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెల రోశయ్య, మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజు, కొండాపూర్ ఉప సర్పంచ్ జిగిరి అమర్, నాయకులు భిక్షపతి, నిఖిల్, భాను, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు'

హుస్నాబాద్: కేసీఆర్ లేకుంటే తెలంగాణ గురించి మాట్లాడేవారే లేరని, కోదండరాంకు ఏమి తెలుసని ఇక్కడికి వచ్చి విమర్శిస్తున్నారని హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్ మండిపడ్డారు. సోమవారం హుస్నాబాద్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ కోసం 360 మంది విద్యార్థులను బలి తీసుకుంది కాంగ్రెస్సేనని అన్నారు. పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో మూడు సార్లు ఓడిపోయి, మళ్లీ హుస్నాబాద్‌కు వచ్చాడని.. ఇక్కడ కూడా ఓడిపోవడం ఖాయమన్నారు. సమావేశంలో ఎడబోయిన తిరుపతి రెడ్డి, దండుగుల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మా రూటే సపరేటు..

దుబ్బాకలో బీఆర్‌ఎస్ నాయకులు వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం పట్టణంలోని 14, 17 వార్డులలో ఆ పార్టీ అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఫొటో మాస్కులు ధరించి ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భూంరెడ్డి, బాలకిషన్ గౌడ్, వంశీకృష్ణ గౌడ్, ఖలీల్, తదితరులున్నారు.

- దుబ్బాక



ప్రభాకర్‌రెడ్డి మాస్కులతో నాయకులు